ప్రజల వెంటే మజ్లిస్ పార్టీ


లబ్ధిదారునికి చెక్ అందిస్తున్న కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకుడు సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో రహత్ క్రైసిస్ సెంటర్ ప్రారంభం



అబిడ్స్: బొగ్గులకుంటలోని ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో రాహత్ క్రైసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఫెర్నాండెజ్ ఫౌండేషన్, ఇన్విజిబుల్ స్కార్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో భారత బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ క్రిస్టినా స్కాట్, తెలంగాణ, ఏపీ ఉమ్మడి రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, ఎండీ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ మాట్లాడారు. మహిళలు గృహహింస నుంచి బయటపడే విధంగా ఈ సెంటర్ అవసరమైన సహాయాన్ని అందిస్తుందని క్రిస్టినా స్కాట్ అన్నారు. గృహహింస బాధితులు తమ జీవితాలను పునర్‌నిర్మించుకోవడానికి అవసరమైన వనరులు, సంరక్షణను అందిస్తుందని పేర్కొన్నారు. గృహహింస వలయంలో చిక్కుకున్న మహిళలను ఆదుకోవడం కోసమే రహత్ క్రైసిస్ సెంటర్ ప్రారంభించామని డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ప్రసూతి వైద్యురాలు డాక్టర్ మైమూనా అహ్మద్, ఇన్విజబుల్ స్కార్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏక్తా వివేక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు కళలు దోహదం



గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ కళలతోనే జాతీయ సమైఖ్యత పెంపొందుతుందని పలువురు వక్తలు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్వరమహతి కళాపరిషత్ ఆధ్వర్యంలో శృజనోత్సవం పేరిట జాతీయస్థాయి కళాపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ నిర్మాత జీవీ నాయుడు, విద్యాసంస్థల ప్రతినిధులు భాస్కర్ లక్ష్మీ, పీవీఆర్ చంద్ర, పేరిణి నర్తకులు బి.శ్రీనివాస్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదిత్య కిరణ్ పాల్గొన్నారు.

సట్టా ఆడుతున్న నలుగురికి రిమాండ్

గౌలిపురా: సట్టా ఆడుతున్న నలుగురిని మొఘల్‌పురా పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌షాహీ ప్రాంతంలో ఈ నెల 21వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో నజీబుద్దీన్ అలీ (50), మహ్మద్ యూసుఫ్ (45), మహ్మద్ ఇబ్రహీం (32), షేక్ యూనుస్ అహ్మద్ (49) గుట్టు చప్పుడు కాకుండా సట్టా ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించిన నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.71,410, సట్టా చిట్టీలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఫొటో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి


శివసేనారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వాహిద్

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం ఫొటో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రపంచ ఫొటోగ్రాఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్పోర్ట్స్ ఫొటో జర్నలిస్టు మహ్మద్ వాహిదుద్దీన్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫొటో జర్నలిస్టుల సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు.

జంతువులను సంరక్షించాలని 24న ర్యాలీ

సుల్తాన్‌బజార్: జంతువులను సంరక్షించి వాటి హక్కులను పరిరక్షించాలని కోరుతూ ఈ నెల 24న సంజీవయ్య పార్కు నుంచి పీపుల్స్ ప్లాజా వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వేగన్స్ ఆఫ్ తెలంగాణ సంస్థ ప్రతినిధి, హైకోర్టు న్యాయవాది ప్రవళిక తెలిపారు. ఈ ర్యాలీకి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జంతువులపట్ల జాలి చూపాలని భారత రాజ్యాంగం చెబుతోందని, జంతువుల ఆవాసాలు ధ్వంసం కావడం, అటవీ ప్రాంతాలు అన్యాక్రాంతం కావడం వల్ల వాటికి స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి కరువైందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు సూరజ్, ఇషాంత్, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

యూటర్న్‌పై పోలీసులతో ఎమ్మెల్యే వాగ్వాదం

జియాగూడ: పురానాపూల్ చౌరస్తా నుండి జాతీయ రహదారిలో ఉన్న యూటర్న్, డివైడర్‌ను తొలగించాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు గురువారం పురానాపూల్ జాతీయ రహదారిలో జరిగిన ఘోర ప్రమాదం వల్ల ఇద్దరు చనిపోవడంతో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పురానాపూల్ వద్దకు చేరుకున్న సౌత్‌వెస్ట్ డీసీపీ ట్రాఫిక్ వెంకటేశ్వర్లు, గోషామహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మిలతో వాగ్వివాదానికి దిగి వాటిని తొలగించాలని పట్టుపట్టారు. చివరగా ఎమ్మెల్యే, స్థానికులు, వ్యాపారుల కోరిక మేరకు ఈ రోజు రాత్రి, డివైడర్, యూటర్న్ తొలగిస్తామని ట్రాఫిక్ విభాగం తెలిపింది.

మార్కెట్లకు గోకులాష్టమి కళ


నెమలీకలు

జియాగూడ: మార్కెట్లకు గోకులాష్టమి కళ వచ్చేసింది. నగరంలో ఈ వేడుకలను ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా ఉత్తర భారతీయులు భక్తిశ్రద్ధలతో ఘనంగా ఈ వేడుకలను నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా చిన్నికృష్ణుడి అలంకరణ సామగ్రి కోసం పెద్ద ఎత్తున జనాలు బేగంబజార్ మార్కెట్లకు తరలివచ్చారు. శ్రీకృష్ణుడు ఆదివారం అర్ధరాత్రి జన్మించగా సోమవారం గోకులాష్టమి వేడుకలలో భాగంగా డోలారోహణం నిర్వహిస్తారు. మరుసటి రోజు ఉట్టి కార్యక్రమాలు, రాధాకృష్ణుల నృత్యాలు, మహాప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయి. చిన్ని కృష్ణుడి కోసం ఉయ్యాలలు, నెమలి పింఛం, పిల్లనగ్రోవి, వస్త్రాలు, ఉట్టీలు, పూలదండలు, ముత్యాల దండల కొనుగోళ్ల కోసం బేగంబజార్, భర్తన్‌బజార్, చుడీబజార్ తదితర ప్రాంతాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.


ఫ్యాన్సీ ఉట్టీలు


ముత్యాల దండలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సుల్తాన్‌బజార్: ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కూకట్‌పల్లిలోని భక్తివేదన స్వామి ప్రాంగణంలో ఉదయం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ మేరకు గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇస్కాన్ కూకట్‌పల్లి శాఖ కో ఆర్డినేటర్ శ్రీవాణి, ప్రతినిధులు లలితా కాబ్రా, అంజనాదేవి, సునీల్‌రాఠీ మాట్లాడారు. ఈ వేడుకల్లో భాగంగా 6 నుంచి 18 సంవత్సరాల వయసు పిల్లల్లో ప్రతిభా నైపుణ్యాలను వెలికి తీయడానికి గానం, నృత్యం, కలరింగ్, డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, శ్లోక పఠనం వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 27న ఇస్కాన్ సంస్థ వ్యవస్థాపకుడు ఏసీ భక్తి వేదాంతస్వామి శీల ప్రభు పాదుల జన్మదిన వేడుకలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఆసక్తిగలవారు ఇతర వివరాల కోసం ఫోన్: 94404 86792 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల చేతుల్లో దేశ భవిష్యత్తు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

గోల్కొండ: విద్యార్థులు తలచుకుంటే ఏదైనా సాధిస్తారని కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎస్ఎన్ మురళీకృష్ణ అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీటెక్ మొదటి సంవత్సరంలోనే విద్యార్థులు తమకు తాము దిశానిర్దేశనం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు. బీటెక్ పూర్తి చేసిన వారికి మన దేశంలోనే కాకుండా ఇతర దేశాలు కూడా పిలిచి మరీ ఉద్యోగాలు ఇస్తున్నాయన్నారు. అగ్రదేశాలలోని నెంబర్ వన్ కంపెనీలలో భారతీయులే ఉన్నత శిఖరాలలో ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ కూడా ఉద్యోగ కల్పన విషయంలో ఇతర నగరాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. జీఎన్ఐటీఎస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి మాట్లాడుతూ తమ పూర్వ విద్యార్థినులు చాలామంది ఉద్యోగాల జోలికి వెళ్లకుండా స్టార్ట్ అప్‌లు ప్రారంభించారని, వ్యాపారాలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


పాల్గొన్న విద్యార్థినిల తల్లిదండ్రులు

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నిరసన


బండ్లగూడ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ముప్పిడి సీతారాంరెడ్డి తదితరులు

చాంద్రాయణగుట్ట: రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేసేంత వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి ముప్పిడి సీతారాంరెడ్డి అన్నారు. రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోవడంపై బీఆర్ఎస్ పిలుపు మేరకు బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ జయమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కొర్రీలు పెట్టి కేవలం 25–30 శాతం రైతులకే ప్రభుత్వం రుణమాఫీ చేసిందని ఆరోపించారు. రుణమాఫీ చేస్తారన్న నమ్మకంతో ఓటు వేసిన రైతులను మోసం చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.నరేష్ కుమార్, గిరిధర్ నాయక్, స్వరూప నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'వాటర్‌బోర్డు' అక్రమాలపై విచారణ జరపండి


ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డు అక్రమాలపై విచారణ జరపాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వాటర్‌బోర్డులో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఏఎంఎస్ విధానం అమలు చేస్తుండటంతో కోట్లాది రూపాయలు వృధా అవుతున్నాయని పేర్కొన్నారు. టెండర్ల ద్వారా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు రిటైర్డ్ అయినా అక్కడే కొనసాగారని అన్నారు. గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అక్రమాలపై చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తే అక్రమాలు బయట పడతాయని పేర్కొనగా, భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు.

విదేశాల్లో ఉద్యోగాలపై నేడు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

విజయనగర్‌కాలనీ: విదేశాల్లో ఉద్యోగాల భర్తీకి శుక్రవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవర్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం) జనరల్ మేనేజర్ కె.నాగభారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రొమేనియా, యూకే, సౌదీ అరేబియాలోని వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్హత, రెండేళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. అభ్యర్థులు శుక్ర వారం ఉదయం 11 గంటలకు విజయనగర్‌కాలనీలో ఉన్న టాంకాం కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 99854 83931, 78935 66493 నెంబర్లలో సంప్రదించవచ్చు.

కేటీఆర్‌కు ఆహ్వానం

చార్మినార్: సంఘ సేవకులు, ప్రముఖ వ్యాపారవేత్త దిడిగే జయంత్–రంగనాయకమ్మ దంపతుల కుమార్తె అనూష వివాహానికి హాజరు కావాలని కోరుతూ మాజీమంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఆహ్వానించారు. దిడిగే జైపాల్, దిడిగే అశోక్ తదితరులు ఆయనను కలిసి ఈ నెల 23న జరగనున్న వివాహ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రం అందజేశారు.

అన్నదానం

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో మెహిదీ నవాబ్‌జంగ్ కేన్సర్ ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించారు. గురువారం 650 మంది రోగుల సహాయకులకు అన్నదానం, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ తరచూ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు. సమాజ సేవ చేయడంలోనే ఎంతో తృప్తి ఉంట్టుందన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ హన్మకొండ అధ్యక్షుడు విరాజేందర్, నాయకులు బి.శంకర్, లక్ష్మీప్రసాద్, మొహియుద్దీన్, టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, ఇతర నేతలు మహ్మద్ వహీద్, ఆసుపత్రి టీఎన్జీవోస్ నాయకులు శివకుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మహావీర్ మార్గంలో ట్రాఫిక్ నరకమే!


మహావీర్ మార్గంలో ట్రాఫిక్ జామ్ దృశ్యం

నాంపల్లి: మహావీర్ మార్గం నుండి లక్డీకాపూల్‌కు వెళ్లే రహదారిలో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా... ఏదైనా వాహనం అడ్డొచ్చినా... ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఒక నిమిషంపాటు ట్రాఫిక్ నిలిస్తే కిలోమీటర్ల మేర వాహనాలు బారులుదీరుతున్నాయి. ట్రాఫిక్ చౌరస్తాలన్నీ స్తంభిస్తున్నాయి. అన్నింటికి మించి వాహనదారుడి ఓపికను పరీక్షిస్తోంది. ఈ రహదారికి అనుసంధానంగా ప్లేఓవర్లు నిర్మించినా... ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసినా పోలీసులకు మాత్రం ట్రాఫిక్‌ను నియంత్రించడం సాధ్యం కావడం లేదు. ఈ రహదారిలో నిత్యం వీఐపీల రాకపోకలు ఉంటాయి. ఈ మార్గం నుంచే అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లాల్సి ఉంటుంది. అన్నింటికి మించి పాత నగరాన్ని, కొత్తనగరాన్ని కలుపే రహదారిగా దీనికి పేరుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి నుండి బయటపడేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సీపీఎం నిరసన

జియాగూడ: 'కార్వాన్, 2జే బస్టాప్ వైపు వెళ్లాల్సిన వాహనాలకు అడ్డుగా ట్రాఫిక్ అధికారులు సిమెంట్ డివైడర్లు వేయడం వల్ల బైపాస్ రోడ్డ కింది భాగంలో వాహనాల రద్దీ పెరిగింది. తక్షణమే వాటిని తొలగించాలి'అని సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం కార్యకర్తలు, నేతలు గురువారం పురానాపూల్ చౌరస్తాలో నిరసన ర్యాలీ చేశారు. బుధవారం సాయంత్రం ఈ ఇరుకైన ఈ మార్గంలో స్కూటర్‌పై వెళ్తున్న తండ్రి బిడ్డ చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు విన్నవించి సమస్యను పరిష్కరిస్తామని గోషా మహల్ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మీ, సీఐ బాలాజీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కడపయ్య, రాజు, సాజీద్, రాజేందర్, లక్ష్మీకాంత్, సల్మాన్, జాఫర్, అస్లాం, ఎండీ గౌస్, ఖలీల్, గిరిబాబు, నరసింహ పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ కార్పొరేటర్ సతీమణి మృతి


కాలే సతీకీర్తన (ఫైల్)

గౌలిపురా: గౌలిపురా డివిజన్ దివంగత మాజీ కార్పొరేటర్ ముత్యాలు సతీమణి సతీకీర్తన(80) గురువారం గుండెపోటుతో మృతి చెందింది. లలితాబాగ్‌లో తన కుమారులు శ్రీనివాస్, ఆనంద్‌ల నివాసంలో ఉండగా సతీకీర్తన ఆరోగ్యం క్షీణించడంతో గురువారం కుటుంబ సభ్యులు శాలిబండలోని ఆస్రా ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగా ఆమెకు గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ వై.కృష్ణ, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు ఆమె కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సతీకీర్తన అంత్యక్రియలను నల్లవాగులోని హిందూ శ్మశానవాటికలో నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కల్యాణం.. కమనీయం


మంగళసూత్రాలు చూపిస్తున్న వేద పండితులు

విజయనగర్‌కాలనీ: పెళ్లికుమారుడిగా ముస్తాబైన శ్రీనివాసుడు కల్యాణ మండపంలో వేచి చూస్తుండగా శ్రీదేవి భూదేవిలను ముత్తయిదువలు పెళ్లి కుమార్తెలుగా అలంకరించి మండపానికి తీసుకువచ్చారు. చూడటానికి రెండు కళ్లు చాలవన్నట్లుగా ఉన్న ఈ సన్నివేశం గురువారం ఆసిఫ్‌నగర్ హనుమాన్ బాలాజీమందిరంలో ఆవిష్కృతమైంది. ఈ నెల 19న ప్రారంభమైన 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు ఆసిఫ్‌నగర్, శంకర్‌నగర్, శ్యామ్‌నగర్, కార్వాన్, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, మురాద్‌నగర్, సీతారాంబాగ్ పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాంపల్లి ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్, ట్రస్టు అధ్యక్షుడు పి.సత్యంచారి, బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరిగె శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సుదర్శనం, కార్యదర్శి బి.రమేష్, డి.శ్రీనివాస్, సామల శ్రీనివాస్, డబ్ల్యూ.పవన్, కె.రాంచందర్, అశోక్, గౌరిగే యాదయ్య శీలం బాలచందర్, సీహెచ్ లక్ష్మీనారాయణ, పి.అంజయ్య యాదవ్, రేణేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఏసీపీ


సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్

సంతోష్‌నగర్: వినాయక ఉత్సవాలను ప్రజలు ఆధ్యాత్మిక, భక్తి వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్ సూచించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం సంతోష్‌నగర్ స్టేషన్ పరిధిలోని ఉత్సవాల నిర్వాహకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు స్థానికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని, నిర్వాహకులు పోలీసుల సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, ఎస్సైలు సిహెచ్.రవి, ఆర్.శివప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కత్తులతో తిరుగుతున్న వ్యక్తికి జైలు


గులాం ముస్తఫా

సంతోష్‌నగర్: మద్యంమత్తులో కత్తులతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తికి మేజిస్ట్రేట్ రెండురోజుల జైలుశిక్ష విధించారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి, ఎస్సై జి.లింగరాజు తెలిపిన వివరాల ప్రకారం... చాంద్రాయణగుట్ట హఫీజ్‌బాబా నగర్ ప్రాంతానికి చెందిన గులాం ముస్తఫా(58) ఈ నెల 20వ తేదీన రాత్రి సమయంలో కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా రెండు కత్తులు లభించాయి. ముస్తఫాను అరెస్ట్ చేసి నాంపల్లిలోని 7వ స్పెషల్ జ్యూడీషియల్ కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ నాగేందర్ సింగ్ వివరాలు పరిశీలించి రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఏపుగా పెరిగినా.. దాపుగా వెళ్లరు!

● ఈ కరివేపాకును తెంచుకోరు.. తుంచుకోరు..

నాంపల్లి: 'కూరలో కరివేపాకు తీసేసినట్లు'అనేది సామెత. కానీ, ఇక్కడ పండిన కరివేపాకును వండిన కూరల్లో వాడకుండానే వదిలేస్తారు. ఆ మొక్కలను స్థానికులు ఎవరైనా చూసినా తెంచుకోరు. కనీసం ముట్టుకోవడానికి కూడా ఎవరూ సాహసం చేయరు. ఎందుకో తెలుసా? ఇది తెలుసుకునే ముందు ఆ తోటలు ఎక్కడున్నాయో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. ఈ కరివేపాకు తోటలను చూడాలంటే నాంపల్లిలోని హబీబ్‌నగర్‌కు వెళ్లాల్సిందే. హైదరాబాద్ రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో హబీబ్‌నగర్ ఉంటుంది. ఈ ప్రాంతంలో అరకులో కాఫీతోటలు కనిపించినట్లుగా కరివేపాకు తోటలు దర్శనమిస్తుంటాయి. హబీబ్‌నగర్ పోలీసుస్టేషన్ చుట్టూ ఉండే మసీద్ ఏ హజరత్ ఆజాద్ షా శ్మశానంలోని సమాధుల చుట్టూ ఇవి ఏపుగా పెరిగాయి. విస్తారంగా సమాధుల చుట్టూ అల్లుకున్నాయి. ఇవి సమాధుల చెంత ఉండడం వల్లే కరివేపాకును ఎవరూ ముట్టుకోరు. తెంచుకోరు.


మసీద్ ఏ హజరత్ ఆజాద్ షా శ్మశానంలో పెరిగిన కరివేపాకు